క్లుప్తంగా

టీపీసీసీ అధ్యక్షుడికి సన్మానం



మహేష్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఇల్లెందు: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను ఇల్లెందు నియోజకవర్గంలోని కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు, ఇల్లెందు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం గాంధీ భవన్‌లో ఆయనను కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డానియేల్, పులి సైదులు, గింజల నర్సిరెడ్డి, దనియాకుల రామారావు తదితరులు ఉన్నారు. అంతకు ముందు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిశారు.

కేటీపీఎస్ సీఈకి..



సీఈని సన్మానిస్తున్న నాయకులు

పాల్వంచ: కేటీపీఎస్ 7వ దశ చీఫ్ ఇంజనీర్ పి.వెంకటేశ్వరరావు 31తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా జాతీయ మాల విద్యుత్ ఉపకులాల అధ్యక్షుడు బూర్గుల విజయ భాస్కర్‌రావు, మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.నవతన్ ఆధ్వర్యంలో గురువారం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వరరావు, నల్లబల్లి రాంబాబు, వినయ్‌రాజ్ పాల్గొన్నారు.

ఎస్‌ఓటూ జీఎంకు..



వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న అధికారులు

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా సింగరేణి ఎస్‌ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లును ఏరియా జీఎం వి.కృష్ణయ్య ఘనంగా సత్కరించారు. గురువారం ఇల్లెందు ఏరియా జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ సందర్భంగా సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. సింగరేణి అధికారులు నరసింహారాజు, శివప్రసాద్, సారయ్య, యాదగిరి పాల్గొన్నారు.

యూజీసీ నిబంధనలను రద్దు చేయాలి

జూలూరుపాడు: విద్యారంగాన్ని కార్పొరేట్‌కు అప్పగించే యూజీసీ ముసాయిదా నిబంధనలను తక్షణమే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జూలూరుపాడులో జరిగిన ఏఐఎస్ఎఫ్ మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫెడరల్ హక్కులను కాలరాసి ప్రభుత్వ యూనివర్సిటీలను మూసివేసే కుట్రలకు యూజీసీ తెరలేపిందన్నారు. విద్యను కార్పొరేట్, కాషాయీకరణ చేసే దిశగా బీజేపీ నడుస్తోందని ఆరోపించారు. యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలను విద్యావేత్తలు, విద్యార్థులు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అనిల్, శ్రీనివాస్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు పూజలు

ఇల్లెందు: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఇల్లెందు బ్రాంచి ఆవరణలో హమాలీలు, ఉద్యోగుల ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ మైసమ్మ తల్లి, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గోమాత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీసీసీ బ్రాంచి మేనేజర్ నర్సింహారావు, లక్ష్మణ్, ఉద్యోగులు, హమాలీలు పాల్గొన్నారు.

బిషప్ కౌన్సిల్ ఈసీ సభ్యుడిగా రత్నప్రభు



నియామకపత్రం అందజేస్తున్న బిషప్‌లు

ఇల్లెందు: తెలంగాణ బిషప్ కౌన్సిల్ సభ్యుడిగా ఇల్లెందుకు చెందిన తాళ్లూరి రత్నప్రభు నియామకం అయ్యారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. మహబూబాబాద్‌లో బైబిల్ తియాలజీ గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌టీ రెవ డాక్టర్ బిషప్ విక్రమ్‌పాల్, జీఎస్ బిషప్ మల్సూర్ నాయక్, జేఎస్ బిషప్ జీవీ ఏసుపాదం, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు బిషప్ జీవీ ఇశ్రాయిల్, బిషప్ డేవిడ్‌లు బెతెలు ప్రార్థనా మందిరం, మహబూబాబాద్ రెవ యోహాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగిందన్నారు.

కుక్కలకు దురద.. జనానికి బెడద



కొత్తగూడెంలో ఓ వీధిలో కుక్కల సంచారం

- ఎలర్జీతో గ్రామసింహాలు సతమతం
- ఎప్పుడు మీద పడతాయోనని బెంబేలెత్తుతున్న ప్రజలు
- అధికారులు స్పందించాలని వినతి



వ్యాధి సోకిన కుక్కలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): గ్రామసింహాలకు వచ్చిన కష్టంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దొంగల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేసే గ్రామసింహాలు ఇప్పుడు జనాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కారణం వాటికి సోకుతున్న దురద వ్యాధి. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ఎక్కడ చూసినా ఎలర్జీతో బాధపడుతూ వెంట్రుకలు ఊడిపోయి, శరీరమంతా చిట్లిపోతున్న కుక్కలే కనిపిస్తున్నాయి. ఈ కారణంగా అసహనానికి గురవుతున్న అవి తోటి కుక్కలతో పాటు ప్రజలపైనా దాడి చేస్తున్నాయి. దురద సోకి చర్మం ఊడేలా ఉన్న కుక్కలు కరిస్తే ఎలాంటి దుష్పరిణామాలు వస్తాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఏబీసీ (యాంటీ బర్త్ కంట్రోల్) పేరుతో గతంలో కుక్కలను పట్టుకుని ఆపరేషన్లు చేసేవారు. ఇటీవల కాలంలో అలాంటి కార్యక్రమాలు కూడా కనుమరుగయ్యాయి. ఇకనైనా అధికారులు స్పందించి ఇలాంటి కుక్కలను జనావాసాలకు దూరంగా తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రధానంగా తినే ఆహారం వల్లే....

చెత్తకుప్పలపై కుళ్లిన ఆహారంతో పాటు మాంసం, జంతు కళేబరాలను పీక్కతినడం వల్ల కుక్కల శరీరంలో ఇలాంటి మార్పులు వస్తాయని జిల్లా పశుసంవర్థక శాఖాధికారి(ఎఫ్‌ఏసీ) డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు చెబుతున్నారు. కొత్తగూడెం, పాల్వంచలో త్వరలోనే ఏబీసీ కేంద్రాలను ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. కుక్కల సంతతిని అరికట్టడానికి కృషి చేస్తూనే ఇక నుంచి డీవార్మింగ్ కూడా చేస్తామని తెలిపారు.

యజమానులు పెంపుడు కుక్కలకు వైద్యం చేయించాలని, యాంటీ రాబిస్ ఇంజక్షన్లతో పాటు డీవార్మింగ్ చేయించాలని సూచించారు.

కుక్కలకు 'పారాసెటిక్'



కుళ్లిపోయిన మాంసం తదితర వ్యర్థాలు తినడం వల్ల కుక్కలకు పారాసెటిక్ అనే వ్యాధి సోకుతుంది. దీని కారణంగా దురద పెరిగి రక్త స్రావం వచ్చేలా గోక్కోవడం వల్ల గాయపడతాయి. అసహనంతో తోటి కుక్కలపైనా దాడి చేస్తాయి. చిన్న కుక్కలైతే ఈ దాడిలో మరణిస్తాయి. వీటికి డీవార్మింగ్ చేయడంతో పాటు వైద్యం అత్యవసరం. – డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి

కుక్కల బారి నుంచి రక్షించాలి..



ఇప్పటికే కోతులతో సతమతమవుతున్నాం. తాజాగా కుక్కలు జనాలపై ఎగబడి దాడి చేస్తున్నాయి. దురద భరించలేక శరీరాన్ని కొరుక్కుంటున్నాయి. వీధుల్లో కుక్కలను చూస్తే భయమేస్తోంది. వీటి నివారణకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి. మాతో పాటు పిల్లలు బయటకు వచ్చేటప్పుడు జాగ్రత్త పడుతున్నా ఆందోళనగానే ఉంది. – గోపాలకృష్ణ, రామవరం

హామీల అమలు ఎప్పుడు?



గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఇల్లెందు: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులకు జ్ఞానోదయం కలగాలని కోరుకుంటున్నట్లు బీఆర్‌ఎస్ నేతలు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను 100 రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించి 420 రోజులు గడిచినా అమలు చేయలేదని బీఆర్‌ఎస్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. గురువారం ఇల్లెందు పట్టణంలో అంబజార్‌లో గాంధీ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, దిండిగల రాజేందర్ మాట్లాడుతూ.. ఏడాదికే ప్రజలకు కాంగ్రెస్ ఇందిరమ్మ పాలన రుచి చూపించారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో లకావత్ దేవీలాల్ నాయక్, ఎస్.రంగనాథ్, పరుచూరి వెంకటేశ్వర్లు, జేకే శ్రీనివాస్, శీలం రమేష్, అజ్మీర భావ్ సింగ్‌నాయక్, ఖమ్మంపాటి రేణుక, అబ్దుల్ నబీ, జబ్బార్, గిన్నారపు రాజేష్, ఆదూరి రవి, హరిప్రసాద్ యాదవ్, చాంద్‌పాషా, దాస్యం ప్రమోద్‌కుమార్, యలమద్ది రవి, నెమలి ధనమ్మ, కడకంచి పద్మ, కటకం పద్మావతి, పోషం కవిత, మల్సూర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: కాంగ్రెస్ పార్టీ హామీలు అమలుకు ఆమడ దూరంలో ఉన్నాయని బీఆర్‌ఎస్ జిల్లా నేత లక్కినేని సురేందర్‌రావు, మండల అధ్యక్షుడు బొమ్మెర వరప్రసాద్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం నాయకులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బోడ బాలు, చీమల సత్యనారాయణ, కుమ్మరి కిరణ్, పూల్ సింగ్, లక్పతి, వెంకన్న, లక్ష్మ, బల్లెం సురేష్, రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు అధికారంలోకి వచ్చి 420 రోజులు గడుస్తున్నా అమలు చేయడం లేదని పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి కనకేష్ అన్నారు. గురువారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసేలా మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, హర్షవర్ధన్, కిరణ్, రాఘవేంద్ర, ప్రసాద్, లోహిత్ సాయి పటేల్, అఖిల్ మహర్షి, రంజిత్, ప్రసాద్, పండు, రాకేష్, శ్రీను, రామారావు, చందు తదితరులు పాల్గొన్నారు.

ట్రైబల్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయండి..



మాట్లాడుతున్న రమేష్ నాయక్

టేకులపల్లి: ట్రైబల్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేసి ఏజెన్సీలో వంద శాతం ప్రభుత్వ ఉద్యోగాలు గిరిజనులతో భర్తీ చేయాలని న్యాయవాది, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మొక్కంపాడుతండాలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ... గిరిజనులతోనే ఉద్యోగాల భర్తీ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని, దేశవ్యాప్తంగా లంబాడీలు మాట్లాడే గోర్ బోలి భాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చి అధికారిక భాషగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. ఫిబ్రవరి 15న జరిగే సేవాలాల్ మహారాజ్ జయంతికి దేశవ్యాప్తంగా సెలవు దినం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన చట్టాలైన 1/70, పీసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, నామినేటెడ్ పదవుల్లో లంబాడీలకు అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జాటోత్ శ్రీనివాస్ నాయక్, మోహన్ నాయక్, రవి నాయక్, రాంజీ నాయక్, హనుమంతు, బాబూరావు, భద్రు పాల్గొన్నారు.

మిర్చి రైతులు మోసపోవద్దు..



రైతులతో మాట్లాడుతున్న నరేష్

టేకులపల్లి: దళారుల మాటలు నమ్మి తక్కువ ధరకు విక్రయించి మిర్చి రైతులు మోసపోవద్దని ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి (గ్రేడ్ 3) నరేష్ అన్నారు. గురువారం టేకులపల్లి మండలం సులానగర్, ముత్యాలంపాడు, సీతారాంపురం గ్రామాల్లోని మిర్చి కల్లాలను సందర్శించారు. రైతులు పండించిన మిర్చి పంటను పరిశీలించారు. పలువురు రైతులతో మాట్లాడారు. మిర్చి బాగా ఎండితే మంచిధర లభిస్తుందని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో రేట్లు హెచ్చు తగ్గులు ఉన్నాయని రైతులు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్న మిర్చిని ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ మార్కెట్లకు తరలించి విక్రయించుకోవాలని సూచించారు. రైతులకు దూరాభారం, ఖర్చులు తగ్గించాలనే ఉద్దేశంలో వారం రోజుల్లో టేకులపల్లిలోని మినీ మార్కెట్ యార్డులోనే మిర్చి కొనుగోళుల ప్రారంభించనున్నట్లు చెప్పారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి..



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఈజీఎస్ ఉద్యోగులు

టేకులపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాపిత కార్యక్రమంలో భాగంగా గురువారం టేకులపల్లి ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. దీర్ఘకాలిక సమస్యలు, పేస్కేల్ అమలు, మూడు నెలలుగా జీతాల విడుదల తదితర అంశాలపై విన్నవించినట్లు ఉద్యోగులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కాలింగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన



టేకులపల్లి: కోయగూడెం పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

జూలూరుపాడు: గుండెపుడి హెల్త్ సబ్ సెంటర్ పరిధిలోని వినోభానగర్, వెంగన్నపాలెం గ్రామాల్లో గురువారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 100 రోజుల నిక్షేయ సివిర్ టీబీ ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... క్షయ వ్యాధిని తరిమి కొట్టేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని, క్షయ వ్యాధి నివారణను సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ వ్యాధి వంశపారంపర్యంగా వస్తుందనేది అపోహ అన్నారు. టీబీ వ్యాధిగ్రస్తుడు మందులు వాడటం ద్వారా జబ్బు తగ్గిపోతుందన్నారు. మందులు వాడే విధానం, తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామకృష్ణ, హెచ్‌వీ రత్నకుమార్, టీబీ సూపర్‌వైజర్ రఫేల్, ఏఎన్ఎం వెంకటముత్యం, సుశీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై...

టేకులపల్లి: జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 15 రోజుల పాటు జరిగే స్పర్శ్ కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమాలు గురువారం మండలంలో నిర్వహించారు. సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు, గ్రామాల్లోని ప్రజలకు అవగాహన సమావేశాలు, ర్యాలీలు నిర్వహించారు. వైద్య సిబ్బంది మాట్లాడుతూ... కుష్టు వ్యాధికి ఉచిత చికిత్స, నాణ్యమైన మందులు ప్రభుత్వాస్పత్రిలో లభిస్తాయని తెలిపారు. ఈ వ్యాధిపై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు.

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా ఉండాలి

టేకులపల్లి: ఉపాధ్యాయలు నిత్య విద్యార్థిగా ఉండాలని, విద్యార్థులకు మంచి భవిష్యత్‌ను అందించాలని టేకులపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం మెరుగు శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వెంకట్యా తండాలో టేకులపల్లి కాంప్లెక్స్ సమావేశం జరిగింది. మాట్లాడుతూ... ప్రతీ ఉపాధ్యాయుడు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని చెప్పారు. ప్రభుత్వం చేపట్టే బాలమేళా కార్యక్రమాన్ని ప్రతీ పాఠశాలలో నిర్వహించి సృజనాత్మత గల బోధనోపకరణాలు తయారు చేయించి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ బానోతు లక్ష్మా, హెచ్‌ఎంలు వెంకయ్య, వెంకట్రాం, సుజాత, హతీరాం పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శుల బదిలీ

ఇల్లెందురూరల్: మండలంలోని రెండు గ్రామపంచాయతీల కార్యదర్శులకు స్థానచలనం కల్పిస్తూ ఎంపీడీఓ ధన్‌సింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తిలక్‌నగర్ కార్యదర్శి నీలిమ ధనియాలపాడుకు, ధనియాలపాడు కార్యదర్శి నమ్మయ్య తిలక్‌నగర్‌కు బదిలీ అయ్యారు.

సీఎంపీఎఫ్ పాసుబుక్‌లు ఇవ్వండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ పాసుబుక్‌లు వెంటనే ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. గురువారం కార్పొరేట్ ఏరియా పరిధిలోని కార్మికుల అడ్డాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతమంది కాంట్రాక్టర్లు మారిపోయారని, కార్మికుల ఖాతాలలో ఎంత డబ్బు ఉందో తెలియక గందరగోళపడుతున్నారని తెలిపారు. సింగరేణి అకౌంట్స్ అధికారులు, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు స్పందించాలని డిమాండ్ చేశారు.

పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం

సింగరేణి(కొత్తగూడెం): ఏరియా రుద్రంపూర్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సింగరేణి హెల్త్ విభాగం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ప్రత్యేక ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఏరియా జీఎం ఎం.శాలేంరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైద్యసిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఆర్థిక సాయం

ఇల్లెందురూరల్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పోలారం గ్రామపంచాయతీ వర్కర్ జటంగి వెంకన్న (జేకే) కుటుంబానికి ఇష్టా నేతలు గురువారం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. సారంగపాణి, సీతారామయ్య, డి.ప్రసాద్, తోడేటి నాగేశ్వరరావు, తొగర సామేలు, మోహన్‌రావు, వీరన్న, భీముడు, లింగమ్మ, యాకస్వామి పాల్గొన్నారు.

మునగ సాగుతో ఆర్థికాభివృద్ధి



మునగ మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

టేకులపల్లి: మునగ సాగు వల్ల రైతులకు అనేక లాభాలు ఉన్నాయని, మునగ సాగుతో ఆర్థికాభివృద్ధి సాధించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ గుగులోత్ లాల్‌చంద్ అన్నారు. గురువారం బోడు, మోదుగులగూడెం గ్రామాల్లో పర్యటించారు. వ్యవసాయ, ఉపాధి హామీ, పంచాయతీరాజ్ శాఖల సంయుక్త సహకారంతో మునగ మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. మాట్లాడుతూ... సన్న, చిన్నకారు రైతులు, ఉపాధి హామీ కార్డు ఉన్న రైతులు మునగ సాగు పథకం కింద ఎకరాకు సుమారు రూ.1.20 లక్షలు సబ్సిడీ పొందే అవకాశం ఉందన్నారు. నీటి సదుపాయం ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఓ నీరుడు అన్నపూర్ణ, ఏఈఓ రమేష్, టీఏ ఈశ్వరి కార్యదర్శి లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

ప్రజాసేవే లక్ష్యం



పద్మ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సీపీఐ ప్రజాప్రతినిధులు పదవి ఉన్నా లేకపోయినా ప్రజల కోసమే పనిచేస్తారని పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. రామవరం వనందాస్ గడ్డలో సీపీఐ శాఖల ఆధ్వర్యంలో గురువారం 10, 11 వార్డుల మాజీ మున్సిపల్ కౌన్సిలర్లకు ఆత్మీయ సన్మానం చేశారు. సాబీర్‌పాషా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మాట్లాడుతూ... నిరంతరం ప్రజల మధ్య ఉంటూ 10వ వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ, 11వ వార్డు కౌన్సిలర్ భూక్యా శ్రీనివాస్ ప్రజాసేవ చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్.జనార్ధన్, ఎస్‌కే జలీల్, సహాయ కార్యదర్శులు బానోత్ చందర్, గుగులోత్ శంకర్, నరేందర్, భూక్యా మహేష్, సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని, హక్కులు అమలు చేయాలని, ఈనెల 31న ఇల్లెందులో జరగనున్న తెలంగాణ ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (పీఎస్‌సీడబ్ల్యూయూ) రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కొత్తగూడెం రీజియన్ అధ్యక్షుడు పి.సతీష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని రైటర్ బస్తీ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, వేతన సవరణ చేయాలని, సీఎంపీఎఫ్ ఖర్చుల వివరాలు చెప్పాలని, సింగరేణిలో ఖాళీగా ఉన్న క్వార్టర్లను కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వాలని తదితర సమస్యల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ మహాసభలో అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలరావు, రాజశేఖర్, కార్మిక నాయకులు రాజేశ్వరి, శాంత, నరసింహా, రమణ పోశం, నాగలక్ష్మి, మరియా, నాగమ్మ, శిరీష, చంద్రకళ, భూషణం పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ బోధనలు ఆదర్శం



ఇల్లెందు: కార్మికులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని గురువారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ... మహాత్ముడి బోధనలు అందరికీ ఆదర్శమని ఆయన అడుగు జాడల్లో నడవాలన్నారు. సత్యాగ్రహమే ఆయుధంగా అహింసా మార్గంలో పోరాడి, భారత జాతికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు అందించిన మహనీయుడు అని కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



పాల్వంచ: నివాళులర్పిస్తున్న కొత్వాల, తదితరులు



సుజాతనగర్: ఎంపీడీఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు



ఇల్లెందురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో... నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



జూలూరుపాడు: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



జూలూరుపాడు: మండల పరిషత్ కార్యాలయంలో...